

# విరిగిన కెరటం

తెల్లమబ్బులు, నీలిమబ్బులు కబాడి ఆడుతున్నాయి. ఎంపైరింగ్ చేస్తున్న సంధ్య ఒంటరిగా, దీనంగా కూర్చున్న లేత రోజారంగు మబ్బు వంక జాలిగా చూసింది.

పిల్లలంతా అరుస్తూ, కొట్టుకుంటూ, నవ్వుతూ కేరింతలు కొడుతూ ఆడుకుంటు న్నారు. ఒకవైపు కోకో, ఒకవైపు గోలీలు, మరోవైపు క్రికెట్, ఇంకోవైపు లాంగ్ జంప్, హైజంప్, హోపింగ్. ఉత్సాహం వెల్లువై ప్రవహిస్తూంది మైదానమంతా.

ఈ ఉరవడిని ఉత్సుకంగా గమనిస్తున్నాయి రెండుకళ్ళు, నర్సింగ్ హోమ్‌వరండాలో నిలబడి అటే చూస్తున్నాడు గోపి. లోతుకుపోయిన ఆతనికళ్ళు వుండుండి తళుక్కు మంటున్నాయి. ఉద్వేగపు కెరటాలు విరిగిపడుతున్నాయతని చిన్నారి గుండెలో. అతని కాళ్ళు వేగంగా పరుగెట్టడానికీ, తన యీడు పిల్లలతో ద్వంద్వయుద్ధం చెయ్యడానికి తహతహలాడుతున్నాయి. అతని శరీరంలోని ప్రత్యణువు ఆ పిల్లల్లో ఒకడుగా కలిసి మిగతా లోకాన్ని మరిచి హాయిగా ఆనందించడానికి తపించి పోతూంది.

కాని... ఊహతెచ్చిన ఉద్రేకాన్నే తట్టుకోలేని అతని గుండె గోడలు బలంగా ప్రకంపిస్తున్నాయి. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు తీవ్రమయాయి. కాళ్ళు శక్తిలేనట్లు ఊగసాగాయి. చేతులు వాలిపోయాయి. శరీరమంతటా చిరుచెమట అలముకుంది. కోపం, బాధ, దుఃఖం, తనముందున్న మృష్టాన్నాన్ని తినలేని ఆశక్తత...

"గోపీ!" బయట పిల్లల్నీ, అతన్నీ గమనిస్తున్న శ్రుతి మెత్తగా పిలిచింది. బలవంతాన శక్తిని కూడదీసుకుని వరండా క్రిందకు గెంతబోయిన గోపీ పట్టుబడిన దొంగలా ఆగిపోయాడు.

"పడుకుని వుండాలని చెప్పానుకదా, ఎక్కడికటు?" మందలింపుగా చూసింది శ్రుతి.

"కొంచెంసేపు ఆడుకుంటానమ్మగారూ! ఈ ఒక్కరోజు, ఒక్క పావుగంట, ఇంకెప్పుడూ అడగను."

ఆశగా అడిగాడు గోపీ, లేడిలా తను పరుగెత్తిన రోజులు, చకచకా చెట్లెక్కి జామకాయలు కోసుకుతిన్న క్షణాలు, గొర్రెపొట్టేల్లా తన స్నేహితులతో తలపడి కొట్లాడిన సమయాలు గుర్తుకొచ్చాయి గోపీకి.

చెమ్మగిల్లిన శ్రుతికళ్ళు గోపీలాంటి లక్షలాది నిర్భాగ్య బాలల్ని అవలోకిస్తున్నాయి. తొలకరి జల్లులో హసిస్తున్న ఇంద్రధనుస్సులా, వెన్నెల చాందినీపై పొరాడుతున్న తుషార బిందువులా ఆహ్లాదంగా గడిచిపోవలసిన వారి బాల్యం ఒక భయంకరమైన స్వప్నంలా మారుతూంది. సరదాగా, హుషారుగా, ఈ లోకంలోని కష్టాల్నీ, పల్లాల్నీ గమనించకుండా 'కొండల్ని పిండిచేస్తాం' అన్నంత ధీమాగా వుండవలసిన పిల్లలు ఈ 'రుమాటిక్ హార్ట్ డిసీజ్' వల్ల నిస్పృహతో, నిరాశతో, నిస్సత్తువతో క్రుంగిపోతున్నారు.

అనారోగ్యపు పొరల్ని ఛేదించుకొని రెక్కలు విప్పుకున్న శ్వేత కపోతంలా ఎగిరిపోవాలనే గోపీ ఆరాటాన్ని చూస్తుంటే కార్డియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ భానో, ఆయన యూనిట్‌లో తను హౌస్‌సర్జన్‌గా పనిచేస్తున్నప్పటి ఓ సంఘటనా గుర్తుకొచ్చింది శ్రుతికి. "ఇన్నాళ్ళనుంచీ ఎందుకు తీసుకురావడంలేదీ అమ్మాయిని? ఎప్పటికప్పుడు చెకప్‌కి తీసుకొచ్చి మందులు వాడితేనేగాని జబ్బు తగ్గదని చెప్పానుకదా?! మళ్ళీ ముంచుకు వచ్చాక తీసుకొచ్చారు" ఒ.పి.లో డాక్టర్ భానోజీ ఎదురుగా కూర్చుని మరో పేషెంటు వివరాలు వ్రాస్తున్న శ్రుతి తలెత్తి ఆ అమ్మాయి వంక చూసింది. అర్భకంగా, అమాయకంగా వున్న ఆ అమ్మాయి బేలగా చూస్తూంది.

"ఏం చెయ్యమంటారయ్యా? హాస్పిటల్‌కి రావాలంటే ఒకరోజు పని సున్నా. మాపటేళకు నాలుగు డబ్బులు తెస్తేగాని కడుపునిండని బతుకులు" విచారంగా చెప్పాడా పిల్లతండ్రి. ఈ కటువైన వాస్తవం డాక్టర్ భానోకి తెలుసు. అతను పైకి చెప్పని మరో కారణం కూడా డాక్టర్‌కి తెలుసు. గుండెజబ్బుల డాక్టరుగారి దగ్గరకు పిల్లను పదిసార్లు తీసుకెళితే జబ్బు సంగతి అందరికీ తెలిసి పిల్లకు పెళ్ళవదేమోనని భయం.

"గచ్చాకు, పుచ్చాకు వైద్యంతో కొంతకాలం, డాక్టరుకు చూపించకుండా మెడికల్ షాపులో తెచ్చుకున్న బిళ్ళలు వాడికొంతకాలం జరిపేశారు. తరువాత డాక్టర్ దగ్గరకు వెళ్ళినా అతను వ్రాసిన మందులు ఫుల్ కోర్సువాడలేదు. గొంతునొప్పి, జ్వరంతో మొదలయిన వ్యాధి

గుండెజబ్బుగా మారాక యిక్కడకు వచ్చారు. యిక్కడ పూర్తి ట్రీట్‌మెంట్ తీసుకోవడానికీ, ఎప్పటికప్పుడు చెకప్స్‌కి రావడానికీ ఎన్నో వ్యక్తిగతమైన, సాంఘికమైన అవరోధాలు.'' ఈ వ్యాధికి ఎరవుతున్న పిల్లల్ని గురించి చెప్తున్న డాక్టర్ భానో కళ్ళల్లో ఆందోళన, ఆవేదన కదిలింది. శాస్త్రపరిశోధనకు, వృత్తికి అంకితమై విజ్ఞాన జ్యోతిలా భాసించే డాక్టర్ భానోదగ్గర పనిచేయడం ఒక గొప్ప అవకాశంగా భావిస్తున్న హౌస్‌సర్జన్లు ముగ్గురూ తమ మనసుల్లోని సందేహాలు బయలు పెట్టారు. తమ సందేహాల్ని తీరుస్తూ ఆయన చెప్పింది గుర్తుకొచ్చి శ్రుతి గుండె భారంగా అయింది.

"దయనీయమైన విషయమేమంటే ఉత్పత్తి కార్యక్రమాల్లో చురుగ్గా తమవంతు పాత్రను నిర్వహించాల్సిన లక్షలాది యువతీయువకులు తమ జీవితంలో ఏ సుఖానికీ, సంతోషానికీ నోచుకోని దురదృష్టవంతులవడమే కాకుండా కుటుంబానికీ, దేశానికీ భారంగా తయారవుతున్నారు.బ్రతుకు అందించే ఎన్నో ఆనందాల్నుంచి వంచితు లవుతున్నారు. దాంపత్య జీవితం గడపడానికీ, గర్భవతి అవడానికీ అర్హతలేని ఇలాంటి పిల్లల్ని చూస్తూంటే ఎలా ఈ భయంకరమైన సమస్య పరిష్కరింపబడుతుంది అన్న ఆవేదన కలుగుతుంది. రోజురోజుకూ అస్తవ్యస్తంగా తయారవుతున్న దేశ పరిస్థితుల్ని గమనిస్తూంటే, అత్యంతవేగంగా పెరిగిపోతున్న దారిద్ర్యాన్ని చూస్తూంటే యిప్పట్లో ఈ సమస్య పరిష్కరింపబడదేమోనన్న నిరాశ ఆవరిస్తుంది.'' డాక్టర్ భానో మంద్ర గంభీర స్వరం వినిపిస్తున్న భావన కలిగింది శ్రుతికి.

"ఇక్కడున్నావంటరా? నీకోసం యిందాకటి నుంచి వార్డంతా వెతుకుతున్నాను, రా, పడుకుందువుగాని'' గోపీ తల్లి కంఠం వినిపించి స్వప్నం నుంచి బయటపడింది శ్రుతి.

"వదులు నేనాడుకోవాలి... చచ్చిపోతే చచ్చిపోతాను... హాయిగా ఆడుకుని మరీ చచ్చిపోతాను... ఎప్పుడూ పడుకో పడుకో, ఈ మాట వినీ వినీ విసుగెత్తి పోయింది నాకు. పడుకుని, పడుకుని పిచ్చెక్కి పోతూంది. ఆ వార్డునీ, మంచాన్నీ చూస్తుంటే పెట్రోలు పోసి తగలబెట్టాలనిపిస్తోంది. నేనింక పడుకోలేను. వదులు నన్ను.'' ఉద్రేకంగా అరుస్తూ, గింజుకుంటూ తల్లి పట్టును విడిపించుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు గోపీ.

"గోపీ!'' గోపీ భుజంచుట్టూ చెయ్యేసి దగ్గరకు లాక్కుంది శ్రుతి. ఆమె స్పర్శతో అతని వుద్రేకం నెమ్మదిగా చల్లబడసాగింది.

"నీ జబ్బు నయమవాలని నీకుందా లేదా చెప్పు? నీ ఆరోగ్యం బాగుపడ్డాక చక్కగా ఆడుకుందువుగాని, ఇప్పుడు లోపలకు వెళ్ళు. రెస్ట్ తీసుకో.'' మృదువుగా శాసించింది శ్రుతి. రెక్కలు తెగిపడిన పక్షిలా, కాళ్ళు నరకపడ్డ కుందేలు పిల్లలా శ్రుతివంక చూశాడు గోపీ.